క్లుప్తంగా

25న సైన్స్ ఫేర్

పాన్‌గల్: మండలంలోని తెల్లరాళ్లపల్లి గ్రామంలోని లిటిల్ స్టార్ హైస్కూల్‌లో ఈనెల 25న సైన్స్ ఫేర్ నిర్వహిస్తున్నట్లు పాఠశాల కరస్పాండెంట్ కాకం ఆంజనేయులు, ప్రిన్సిపాల్ శేఖర్ యాదవ్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సైన్స్‌ఫేర్‌లో దాదాపుగా 100 ప్రయోగాలతో విద్యార్థులను ఆలోచింప చేసే విధంగా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమానికి తరలివచ్చే విద్యార్థులకు బస్సు సౌకర్యం, మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేసినట్లు వారు పేర్కొన్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు పాల్గొనవచ్చని సూచించారు.

తెల్లరాళ్లపల్లితండా వాసికి జాతీయస్థాయి ఫెలోషిప్



పాన్‌గల్: మండలంలోని తెల్లరాళ్లపల్లితండాకు చెందిన ఇస్లావత్ వెంకటేష్ జాతీయ స్థాయి ఫెలోషిప్‌కు ఎంపికైనట్లు ఆయన ఆదివారం తెలిపారు. జాతీయ స్థాయి పరీక్ష అయిన యూజీసీ నెట్ డిసెంబర్ 2024 ఫలితాలు శనివారం విడుదల కాగా ఆ ఫలితాల్లో లా సబ్జెక్టులో ఉత్తమ మార్కులు సాధించి జేఆర్‌ఎఫ్‌కు ఎంపికైనట్లు ఆయన పేర్కొన్నారు. ఉస్మానియా యూనివర్సిటీలో ఎల్‌ఎల్‌బీ, ఎల్‌ఎల్‌ఎం పూర్తి చేసి న్యాయవాది వృత్తిలో కొనసాగుతున్నాడు. మారుమూల గిరిజనతండాకు చెందిన తల్లిదండ్రులు తండాలో చిన్న హోటల్ నడుపుతూ కుమారుడిని ఉన్నత చదువులు చదివించడంపై తండావాసులు, గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బాల్యానాయక్ హర్షం వ్యక్తం చేశారు. తండా యువత వెంకటేష్‌ను స్ఫూర్తిగా తీసుకొని ఉన్నత చదువులు అభ్యసించాలని సూచించారు.

మట్టి తరలింపును అరికట్టండి



వీపనగండ్ల: గోపల్‌దిన్నె రిజర్వాయర్ ప్రధాన కాల్వలకు ఇరువైపులా ఉన్న మట్టిని యథేచ్ఛగా తరలిస్తుండడంతో ప్రధాన కాల్వలకు ప్రమాదం పొంచి ఉందని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గోపల్‌దిన్నె సమీపంలో రక్షణ కోసం నిల్వ ఉంచిన మట్టిని వాణిజ్య అవసరాల కోసం పలువురు ట్రాక్టర్ల ద్వారా తరలిస్తున్నా వారిని వారించేవారు కరువయ్యారని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రెవెన్యూ, పోలీసు అధికారులు నిఘా వేసి మట్టి తరలింపును అడ్డుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రశాంతంగా గురుకుల ప్రవేశ పరీక్ష



గోపాల్‌పేట: ఐదో తరగతిలో ప్రవేశం కోసం మండలంలోని బుద్దారం గురుకుల పాఠశాలలో ఆదివారం నిర్వహించిన పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. బుద్దారం గురుకుల సెంటర్‌లో మొత్తం 795 మంది విద్యార్థులు పరీక్ష రాయాల్సి ఉండగా.. 774 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకాగా 21 మంది విద్యార్థులు హాజరు కాలేదు. ఉదయం పదకొండు గంటల నుంచి ఒంటిగంట వరకు పరీక్ష నిర్వహించారు. గోపాల్‌పేట పోలీసులు పరీక్ష కేంద్రం వద్ద బందోబస్త్ ఏర్పాటు చేశారు.

15 శాతం నిధులు కేటాయించాలి

గట్టు: విద్య రంగానికి రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌లో 15 శాతం నిధులను కేటాయించాలంటూ బాలల పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం మండల కేంద్రంలోని పంచాయతీ కార్యాలయం వద్ద సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టారు. సంతకాల సేకరణ అనంతరం సీఎం రేవంత్‌రెడ్డికి పత్రాలు పంపనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ.. బడ్జెట్‌లో విద్యా రంగానికి నిధుల తక్కువగా కేటాయించడం ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు దెబ్బతిన్నట్లు ఆరోపించారు. అన్ని పాఠశాలలను పూర్వ ప్రాథమిక విద్యకు అనుసంధానం చేయాలన్నారు. పూర్తి స్థాయిలో జిల్లా, మండల విద్యాధికారులను నియమించాలని కోరారు. కార్యక్రమంలో బాలల హక్కుల పరిరక్షణ కమిటీ మండల కోకన్వీనర్ నర్సింహులు, తిమ్మప్ప, రాముడు తదితరులు పాల్గొన్నారు.

మైసమ్మ జాతరకు తగ్గిన భక్తుల రద్దీ

పెద్దకొత్తపల్లి: నాయినోనిపల్లి మైసమ్మ జాతరలో భక్తుల రద్దీ తగ్గింది. వ్యవసాయ పనులు ఉండటంతో ఆదివారం తక్కువ సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు. సుమారు 6వేల మంది భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. భక్తుల రద్దీ తగ్గడంతో జాతరలో పలు దుకాణాలు వెలవెలబోయాయి.

నిఘా నీడలో పల్లెలు



వెల్టూరులో సీసీ కెమెరాలు ప్రారంభిస్తున్న ఎస్పీ రావుల గిరిధర్ (ఫైల్)

- సీసీ కెమెరాల ఏర్పాటుకు ముందుకొస్తున్న గ్రామాలు
- దాతల సహకారంతోనే..
- 12 గ్రామాల్లో సీసీ కెమెరాల బిగింపు

చిన్నంబావి: నేరాల నియంత్రణ కోసం గ్రామ స్థాయి నుంచి చర్యలు చేపట్టేందుకు పోలీసు శాఖ సన్నాహకాలు ప్రారంభించింది. మండలంలోని అన్ని గ్రామాల్లో గ్రామస్తుల సహకారంతో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసేందుకు వారిని మరింత ప్రోత్సహిస్తున్నారు. ఈ మేరకు ఇది వరకే దాదాపు అన్ని గ్రామాల్లో పోలీసులు అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నారు.

ప్రధాన కూడళ్లలో..

గ్రామాల్లోని ప్రధాన కూడళ్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం ద్వారా ఆయా గ్రామాలకు వచ్చిపోయే వ్యక్తులు, వాహనాలు వివరాలు తెలుసుకోవచ్చు. దాడులు, దొంగతనాలు, రోడ్డు ప్రమాదాలు ఇతర నేరాలకు పాల్పడే వారిని పట్టుకునేందుకు వీలు కలుగుతుంది. సీసీ కెమెరాలను పోలీస్‌స్టేషన్ కంట్రోల్ రూంకు అనుసంధానం చేసి ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తారు. తద్వారా అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకుంటే సత్వరం స్పందించే అవకాశం ఉంటుంది. అలాగే నేరస్తుల గుర్తింపు, కేసుల విచారణ సమయం ఆదా అవుతుందని, బాధితులకు సత్వర న్యాయం జరుగుతుందని పోలీసులు అంటున్నారు.

పోలీస్‌శాఖ అప్రమత్తం

ఏడాది కాలంగా మండలంలో నేరాల సంఖ్య పెరుగుతుండటంతో చిన్నంబావి పోలీస్‌శాఖ అప్రమత్తమైంది. ఎస్పీ రావుల గిరిధర్ సూచనల మేరకు మండలంలోని అన్ని గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటుకు పోలీస్‌శాఖ చర్యలు చేపట్టింది. మండలకేంద్రంతో పాటు వెల్టూరు, లక్ష్మీపల్లి, పెద్దదగడ, కొప్పునూరు, దగడపల్లి, అమ్మాయిపల్లి, బెక్కెం గ్రామాల్లో సీసీ కెమెరాలను దాతల సహకారంతో ఏర్పాటు చేశారు.

రూ.5 లక్షలతో..

వెల్టూరు గ్రామం మండలంలోని ఇతర గ్రామాలకు ఆదర్శంగా ఉండాలనే ఉద్దేశంతో పోలీసుల సూచన మేరకు రూ.5లక్షల సొంత ఖర్చులతో 15 హై క్వాలిటీ సీసీ కెమెరాలు ఏర్పాటు చేశాను. సీసీ కెమెరాలు 24 గంటలు పని చేసేలా అమర్చాం. నేరాల నియంత్రణకు అందరూ సహకరించాలి.

– కొత్త కళ్యాణ్‌రావు, కేఎంఆర్ ట్రస్ట్ చైర్మన్

నేరాల సంఖ్య తగ్గుతుంది



చిన్నంబావి మండలంలో ఎస్‌ఐగా బాధ్యతలు తీసుకుని రెండు నెలలు అవుతుంది. గతంతో పోల్చితే ఇప్పుడు నేరాల సంఖ్య తగ్గింది. నేను వచ్చిన కొత్తలో మండలంలో వరుస దొంగతనాలు, నేరాలు, రోడ్డు ప్రమాదాలు జరగడం, నిందితులను గుర్తించడం కోసం ఇబ్బందులు ఏర్పడేవి. ఎస్పీ సూచన మేరకు మండలంలోని 12 గ్రామాల్లో దాతల సహకారంతో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశాం.

– జగన్మోహన్, ఎస్‌ఐ, చిన్నంబావి

భక్తిశ్రద్ధలతో ఈదమ్మ జాతర



అలంకరణంలో ఈదమ్మ మాందాతలు



గాజులు వేయించుకుంటున్న మహిళలు

- జిల్లా నలుమూలల నుంచి తరలివచ్చిన భక్తులు

ఖిల్లాఘనపురం: మండల కేంద్రంలో ఆదివారం ఈదమ్మ దేవత ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఉదయం నుంచి జిల్లా నలుమూలల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు. ఈ ఉత్సవాల సందర్భంగా ఆలయం వద్ద నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తు కొందరు కోడిపుంజులు, పొటేళ్లు అమ్మవారికి బలిచ్చి మొక్కులు తీర్చుకున్నారు. జాతర సందర్భంగా ఆలయ ప్రాంగణంలో సంతబజారు వరకు తినుబండారాలు, గాజులు, స్వీట్లు, ఆట వస్తువులు తదితర వాటి స్టాళ్లు ఏర్పాటు చేశారు. వారం రోజుల పాటుగా జాతర కొనసాగనుందని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

శివ మాలధారుల ఇరుముడి పూజలు

ఖిల్లాఘనపురం: మండలంలోని సల్కెలాపురం గ్రామం ఆదివారం శివ నామస్మరణతో మార్మోగింది. 30 మంది శివ మాలధారులు గ్రామంలోని ఆంజనేయస్వామి ఆలయం వద్ద గురుస్వాముల ఆధ్వర్యంలో ఇరుముడి పూజలు నిర్వహించారు. అనంతరం దేవాలయ ప్రాంగణంలో మాలధారులకు బిక్ష, భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. సాయంత్రం నాలుగు గంటల ప్రాంతంలో మాలధారులను ప్రజలు బాజాబజంత్రీలతో పొలిమేర వరకు సాగనంపగా.. పాదయాత్రగా శ్రీశైలం తరలివెళ్లారు.



సల్కెలాపురంలో ఇరుముడి పూజలు చేస్తున్న మాలధారులు

'కార్యకర్తల కుటుంబాలకు అండగా ఉంటాం'



బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి

మదనాపురం: మండలంలోని అజ్జకొలులో బీఆర్ఎస్ మండల ఉపాధ్యక్షుడు కరుణాకర్‌రెడ్డి తండ్రి నాగిరెడ్డి మరణించారు. విషయం తెలుసుకున్న దేవరకద్ర మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి ఆదివారం బాధిత కుటుంబ సభ్యులకు పరామర్శించి, ప్రగాఢ సానుభూతి తెలిపారు. కార్యకర్తలకు ఎలాంటి ఇబ్బందులు వచ్చిన తాము ముందుంటామని, ధైర్యంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ కృష్ణయ్యయాదవ్, మండల అధ్యక్షుడు యాదగిరి, నాయకులు అనిమోని మాసన్న యాదవ్, వెంకటేశ్‌యాదవ్, మనోజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గోపాల్‌పేట: రేవల్లి మండలంలోని చెన్నారంలో ఇటీవల షార్ట్‌సర్క్యూట్‌కు గురై ఇంటి సామగ్రి దగ్ధమైన బంకలజ్యోతి ఇంటికి వెళ్లి, బాధిత కుటుంబ సభ్యులను మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి పరామర్శించారు. విద్యుత్ అధికారులతో మాట్లాడి ప్రభుత్వం నుంచి పరిహారం అందేలా చూస్తానని భరోసా కల్పించారు. తక్షణ ఆర్థికసాయంగా రూ.పది వేలు బాధిత కుటుంబానికి అందించారు. కార్యక్రమంలో మీడియా కన్వీనర్ అశోక్, మాజీ ఎంపీటీసీ రాజురెడ్డి, మాజీ సర్పంచ్ రమేష్‌యాదవ్ నాయకులు పాల్గొన్నారు.

'చర్యలు తీసుకోవాలి'



అమరచింత: శ్రీచైతన్య విద్యా సంస్థల్లో చోటు చేసుకుంటున్న విద్యార్థుల ఆత్మహత్యలపై న్యాయ విచారణ జరిపించాలని, విద్యా సంస్థల గుర్తింపు రద్దు చేసి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు వెంకటేష్ డిమాండ్ చేశారు. మండలంలోని నందిమళ్లలో పీడీఎస్‌యూ శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల ఆత్మహత్యలు ఆందోళనకు గురిచేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. చనిపోయిన విద్యార్థి కుటుంబాలకు రూ.50లక్షలు ఇవ్వాలన్నారు. అనుమతులు లేకుండా కొనసాగిస్తున్న శ్రీచైతన్య విద్యాసంస్థలను వెంటనే తొలగించాలని కోరారు. రాష్ట్రంలో ప్రవేశ పెట్టబోయే బడ్జెట్‌లో విద్యకు 30 శాతం నిధులు కేటాయించాలని, ప్రభుత్వ విద్యాసంస్థలను బలోపేతం చేయాలన్నారు. కార్యక్రమంలో దీవెన్, సాయికుమార్, శివ, రాఘవేంద్ర, అనిల్, ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు భవన నిర్మాణ సంఘం మహాసభ

అమరచింత: ప్రగతిశీల భవన, ఇతర నిర్మాణ కార్మిక సంఘం జిల్లా మూడో మహాసభ జిల్లా కేంద్రంలో సోమవారం నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రాజు తెలిపారు. జిల్లా ఏర్పడి నేటికీ పదేళ్లు అవుతున్నా రెగ్యులర్ లేబర్ అధికారులు లేకపోవడం శోచనీయం అన్నారు. సంక్షేమ పథకాలు సక్రమంగా కార్మికులకు అందాలంటే లేబర్ అధికారులను ప్రభుత్వం వెంటనే నియమించాలని డిమాండ్ చేశారు. కార్మికుల హక్కుల కోసం నిర్వహించే మహాసభకు కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ఆలయ రోడ్డుకు మరమ్మతు

- జాతరకు ముమ్మర ఏర్పాట్లు

ఆత్మకూర్: పట్టణ శివారులోని చెరువులో వెలసిన స్వయంభూ పరమేశ్వరస్వామి జాతర సందర్భంగా ఏర్పాట్లు చేపడుతున్నామని ఆలయ చైర్మన్ వెంకట నర్సింహారావు, వైస్‌చైర్మన్ ఏపూరి యాదగిరిశెట్టి, ప్రధానకార్యదర్శి సాయిరాఘవ, కోశాధికారి మణివర్ధన్‌రెడ్డి, సహాయకార్యదర్శి తెలుగు నాగేష్, పూజారి కర్నసయ్య తెలిపారు. ఆలయానికి వెళ్లేందుకు ఆదివారం మట్టిరోడ్డును బాగుచేయించారు. పరిసరాల్లో పేరుకుపోయిన ముళ్ల పొదలను జేసీబీ ద్వారా తొలగించారు. మార్చి 1, 2, 3 తేదీల్లో రాత్రి 9గంటలకు తేరు మహోత్సవం కనులపండుగగా జరుగనుందన్నారు. వారం రోజుల పాటు జాతరను ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేపడుతున్నామని, మార్చి 3న సాంస్కృతిక కార్యక్రమాలు, జిల్లాస్థాయి కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నామని, మూడు రోజుల పాటు ప్రత్యేక పూజలతో పాటు పల్లకీసేవ, రథోత్స వేడుకలు ఘనంగా నిర్వహించనున్నారు. భక్తులు వేలాదిగా జాతర ఉత్సవాల్లో పాల్గొనాలని నిర్వాహకులు కోరుతున్నారు.



పరమేశ్వరస్వామి ఆలయ రోడ్డుకు మరమ్మతు చేయిస్తున్న నిర్వాహకులు

లింక్ రోడ్డు నిర్మించండి

వీపనగండ్ల: మండల కేంద్రం నుంచి కామదేనిపల్లి బుర్జు, వెలగొండ గ్రామ ఆర్‌అండ్‌బీ ప్రధాన రోడ్డుకు వెళ్లేందుకు లింక్ రోడ్డును నిర్మించాలని పలుమార్లు అధికారులకు విన్నవించినా స్పందించడం లేదని వీపనగండ్ల, గోపల్‌దిన్నె, రంగవరం, వెలగొండ గ్రామాల ప్రజలు ఆవేదన చెందుతున్నారు. లింక్ రోడ్డు వెళ్లే మార్గంలో పల్లె చెరువుకట్టపై కంపతార చెట్లు ఏపుగా పెరగడంతో కనీసం రైతులు పంట పొలాలకు వెళ్లేందుకు వీలు లేకుండా పోయింది. అధికారులు స్పందించి కంపతార చెట్లను తొలగించి లింక్‌రోడ్డు నిర్మాణం కోసం అవసరమైన నిధులు మంజూరు చేయాలని ప్రజలు కోరుతున్నారు.



పల్లె చెరువుకట్టకు ఇరువైపులా ముళ్లపొదలు

'బండి సంజయ్ వ్యాఖ్యలు సరికాదు'



మాట్లాడుతున్న ముస్లిం జేఏసీ నాయకులు

అమరచింత: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కుల గణనలో ముస్లిం మైనార్టీలను బీసీలలో చేర్చొద్దని కేంద్రమంత్రి బండి సంజయ్ సూచించడం తగదని ముస్లిం జేఏసీ అధ్యక్షుడు అయూబ్‌ఖాన్ అన్నారు. మండల కేంద్రంలో ఆదివారం ఆయన మాట్లాడుతూ.. 2016లో జస్టిస్ సచార్, జస్టిస్ రంగనాథ్ మిశ్రా కమిషన్ సిఫార్సుల మేరకు అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ముస్లింలకు 4శాతం రిజర్వేషన్ కల్పించారన్నారు. విద్య, ఆర్థిక, ఉద్యోగ, సామాజిక, రాజకీయ రంగాల్లో ముస్లింలు అందరి కంటే పేదరికంలో ఉన్నారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కులగణనలో ముస్లింలను బీసీలో చేరిస్తే పార్లమెంట్‌లో బిల్లును అడ్డుకుంటామని బీజేపీ కేంద్రమంత్రి బండి సంజయ్ ప్రకటించడం ఎంత వరకు సమంజసం ప్రశ్నించారు. బీజేపీ ముస్లిం వ్యతిరేకంగా ఉందనే విషయం వారి మాటల్లోనే తెలుస్తుందని, ఇలాంటి ఘటనలకు పాల్పడితే శాంతియుతంగా ఉద్యమాలు చేపట్టేందుకు సిద్ధంగా ఉన్నామని వెల్లడించారు. కార్యక్రమంలో తౌఫిక్, నబి, పాషా, దస్తగీర్, నిసార్, అబేద్, ఫయాజ్ తదితరులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదంలో గుడిసెలు దగ్ధం

అయిజ: మండల కేంద్రంలో ఆదివారం రాత్రి జరిగిన అగ్ని ప్రమాదంలో రెండు గుడిసెలు దగ్ధమయ్యాయి. ప్రమాదంలో రూ.2 లక్షల వరకు ఆస్తి నష్టం జరిగినట్లు బాధితులు తెలిపారు. వివరాలు.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అన్నమయ్య జిల్లాకు చెందిన వెంకట రమణ, వెంకటమ్మ, రమేష్, రాజు కొంత కాలంగా మండల కేంద్రంలోని భరత్ నగర్ కాలనీలో నివాసముంటున్నారు. తిక్కవీరేశ్వర స్వామి జాతరలో గాజులు విక్రయించేందుకు వెళ్లారు. ఈ నేపథ్యంలో వారు నివాసముంటున్న గుడిసెలకు ప్రమాదవశాత్తు నిప్పు అంటుకోవడంతో రూ.45 వేలు విలవుచేసే గాజులు, రూ.10 వేల నగదు, ఫర్నిచర్ తదితర సామగ్రి మంటల్లో దగ్ధమైనట్లు బాధితులు పేర్కొన్నారు. ప్రమాదానికి కారణం తెలియాల్సి ఉంది.



'సమయాన్ని వృథా చేయొద్దు'

పాన్‌గల్: పదో తరగతి విద్యార్థులు సమయాన్ని వృథా చేయకుండా ప్రణాళిక ప్రకారం చదువుతూ ఉత్తమ ఫలితాలు సాధించాలని ఎంఈఓ శ్రీనివాసులు విద్యార్థులకు సూచించారు. ఆదివారం మండల కేంద్రంలోని ఎస్సీ బాలుర వసతి గృహాన్ని సందర్శించి వార్షిక పరీక్షలపై విద్యార్థులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హాస్టల్‌లో విద్యార్థులు అందరూ కూడా క్రమశిక్షణ, సత్ప్రవర్తనతో మెలుగుతూ మంచి పేరు తెచ్చుకోవాలన్నారు. మహనీయులను స్ఫూర్తిగా తీసుకొని భవిష్యత్‌లో ఉన్నత లక్ష్యాలు సాధించాలని ఆకాంక్షించారు. అనంతరం హాస్టల్‌లో అందుతున్న భోజనం, వసతులు, సమస్యలపై ఆరా తీశారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంఈఓ శ్రీనివాసులు

వీరాంజనేయ విగ్రహ పునఃప్రతిష్ఠాపనోత్సవం



యంత్ర ప్రతిష్ఠ పూజలు చేస్తున్న మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి

- కనులపండువగా ధ్వజస్తంభం ప్రతిష్ఠాపన
- వందలాదిగా తరలివచ్చిన భక్తులు

వనపర్తి టౌన్: 400 ఏళ్ల నాటి పాతబజార్‌లోని సీతారామ సైత వీరాంజనేయ ఆలయం పునః ప్రతిష్ఠ మహోత్సం ఆదివారం అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మహాస్థాపన, బొడ్రాయి ప్రతిష్ఠ, శయాధివాసంలో ఉన్న దేవతామూర్తులను మూల నక్షత్ర యుక్త మీన లగ్నంలో యంత్ర ప్రతిష్ఠ చేశారు. వేదపండితుల మంత్రోచ్ఛరణల మధ్య విగ్రహాలకు జీవకళ ఉట్టిపడేందుకు జీవన్యాసము, నేత్రోన్మీళనం చేపట్టారు. అనంతరం కామధేనుతో దేవతామూర్తులను దర్శించుకోవడంతో మూడు రోజులుగా నడుస్తున్న పూర్ణాహుతి క్రతువును పూర్తి చేశారు. విగ్రహా ప్రతిష్ఠ అనంతరం శంకు, చక్రాలు, త్రిశూలం, నాగదేవతామూర్తుల కలిగిన 42 అడుగుల ఎత్తైన ఏకశిల ధ్వజస్తంభం ప్రతిష్ఠను శాస్త్రోక్తంగా చేపట్టారు. భక్తులు చేసిన శ్రీరామ నామస్మరణ నినాదాలతో ఆలయ ప్రాంగణం మార్మోగింది. అంతకుముందు భక్తులు ఏకశిల ధ్వజస్తంభానికి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే రావుల చంద్రశేఖర్‌రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు నారాయణ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. సుదీర్ఘ చరిత్ర ఉన్న ఆలయం ఇన్నాళ్లు రహదారి కిందిభాగంలో ఉండేదని, ప్రస్తుతం ఆలయం పున: ప్రతిష్ఠతో ఆలయానికి శోభ చేకూరిందని భక్తులు, ప్రముఖులు హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు. పూజల అనంతరం భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో వేద పండితులు జోషి ప్రశాంత్‌శర్మ, ధీరజ్‌శర్మ, నరేందర్‌శర్మ, శాంతికృష్ణశర్మ, రాజకీయ నాయకులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



క్రేన్ సాయంతో ఏకశిల ధ్వజస్తంభాన్ని ప్రతిష్ఠిస్తున్న భక్తులు, అర్చకులు

భగవద్గీతతో ఆధ్యాత్మిక చింతన



భగవద్గీత గ్రంథాలను ప్రచారం చేస్తున్న ప్రబోధ సేవాసమితి సభ్యులు

కొత్తకోట రూరల్: భగవద్గీత చదివితే జ్ఞానం పెరుగుతుందని త్రైతసిద్ధాంతం–ప్రబోధ సేవాసమితి ఇందూ జ్ఞాన వేదిక కొత్తకోట కమిటీ అధ్యక్షుడు విజయ భాస్కర్‌రెడ్డి అన్నారు. మహాశివరాత్రి పురస్కరించుకుని ఆదివారం పెద్దమందడి మండలంలోని చిలకటోనిపల్లిలో త్రైత సిద్ధాంత భగవద్గీత అనుబంధ గ్రంథాలను ప్రచారం చేశారు. ఈ సందర్భంగా శివరాత్రి విశిష్టతను తెలియజేశారు. శివలింగంపైన ఉన్న మూడు విభూతి రేఖలు జీవాత్మ, ఆత్మ, పరమాత్మకు గుర్తు అని, ఆత్మను ఆరాధిస్తే జీవుడు మోక్షం పొందుతాడన్నారు. అందుకే మధ్యలో ఉండే విభూతి రేఖకు ఎర్రని బొట్టు పెడతారని, మూడు ఆత్మల వివరణ తెలుసుకోవడం ఆధ్యాత్మికంలో ముఖ్యమైన విషయమని తెలిపారు. శివరాత్రి జాగరణ అంటే మాయపై జాగృతి కలిగి జ్ఞానం పొంది ఇతరులకు కూడా దైవ జ్ఞానం తెలియజేయడమని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాసన్న, వేణుగోపాల్, బాలకృష్ణ, శివ, తిరుమలేష్, భాస్కర్‌రెడ్డి, ముజాఫర్‌ఖాన్, శైలజ, జ్యోతి, శంకరమ్మ, ప్రమీల, మంజుల, లయ ఉన్నారు.

కరాటే క్రీడాకారులకు అభినందన

కొత్తకోట రూరల్: హైదరాబాద్‌లోని ఎల్బీనగర్‌లో గల నారాయణ స్కూల్ ఆవరణలో నిర్వహించిన బ్లాక్ బెల్ట్ గ్రేడింగ్ పరీక్షలో కొత్తకోటలోని గాడ్స్ ఆన్ వారియర్స్ షోటోఖాన్ కరాటే అకాడమీకి చెందిన విద్యార్థులు ప్రతిభ కనబర్చినట్లు క్లబ్ ఫౌండర్ అబ్దుల్‌నబీ తెలిపారు. బ్లాక్ బెల్ట్ విభాగంలో జరిగిన పోటీల్లో ప్రతిభ కనబర్చిన విజయ్‌కుమార్, దుర్గాప్రసాద్‌చారి, రాచాల తరుణ్, ఎస్.సాయి, దివేశ్, సత్యసింహ కు సినీ హీరో సుమన్ బెల్ట్‌లు, సర్టిఫికెట్లను అందజేశారు. కరాటే మాస్టర్ ఎండీ ఇంతియాజ్‌ను, క్లబ్ ఫౌండర్ అబ్దుల్ నబీని సుమన్ ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో సీనియర్ కరాటే మాస్టర్లు సదాశివం, సయ్యద్ అశ్వక్, రఫీఖాద్రి, వెంకటేష్, జి.హరీష్‌యాదవ్, జాఫర్‌సాదిక్ తదితరులు ఉన్నారు.